క్లుప్తంగా

వైభవంగా అమ్మవారి ఊరేగింపు



వెలగదుర్రులో కనకదుర్గమ్మ వారి ఊరేగింపు

ఉండ్రాజవరం: దసరా ఉత్సవాల్లో భాగంగా వెలగదుర్రు గ్రామంలో కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ వారి ఊరేగింపును బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన వివిధ దేవతా మూర్తుల వేషధారణలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పలువురు భక్తులు అమ్మవారికి దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

కొవ్వూరు: స్థానిక మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్‌లో వివిధ మరమ్మతులు చేపట్టేందుకు పట్టణంలో గురువారం సాయంత్రం తాగునీటి సరఫరాను నిలిపి వేస్తున్నట్టు కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. 18వ తేదీ ఉదయం నుంచి మళ్లీ తాగునీటి సరఫరా యథావిధిగా నిర్వహిస్తామన్నారు. పట్టణ వాసులు సహకరించాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్ష్యం



పోతవరం అంగన్‌వాడీ కేంద్రం

నల్లజర్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు సక్ష్యం 2.0 పోషణ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని నల్లజర్ల, గోపాలపురం, దేవరపల్లి మండలాల్లోని 172 కేంద్రాల్లో ఈ పథకాన్ని అమలు చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్టు సీడీపీఓ కె.నాగలక్ష్మి బుధవారం తెలిపారు. సొంతభవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ పథకం అమలు కానున్నది. ఎంపిక చేసిన కేంద్రాల్లో రూ.10 వేల వ్యయంతో న్యూట్రి గార్డెన్, రూ.10 వేలతో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, రూ.19,800 వ్యయంతో అంగన్‌వాడీ కేంద్రానికి పెయింటింగ్ వంటి మౌలిక వసతులు కలిప్తారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కొన్ని కేంద్రాల్లో తాగునీటి వసతి, మరుగుదొడ్లు ఏర్పాటు చేయనున్నారు. మరుగుదొడ్డికి రూ.36 వేలు, తాగునీటికి రూ.17 వేలు కేటాయించారు. వీటన్నింటికి ప్రతిపాదనలు పంపినట్టు నాగలక్ష్మి తెలిపారు. ఈ నిర్మాణాలన్నీ గ్రామీణ నీటిసరఫరా విభాగం, ఉద్యానశాఖ, డ్వామా, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో జరగనున్నాయి.

సెపక్ తక్రా పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికైన జిల్లా స్త్రీ, పురుష జట్లు

దేవరపల్లి: రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు జిల్లా స్త్రీ, పురుష జట్లు ఎంపికయ్యాయి. దేవరపల్లి మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల పురుషుల విభాగానికి ఎల్.గణపతి, సీహెచ్ సతీష్, కె.పవన్, టి.వంశీ, పి.సాయి, పి.సారథి ఎంపికయ్యారు. స్త్రీల జట్టుకు జి. రోహిత్, పి.దుర్గా మాధురశ్రీ , ఎం. మహాలక్ష్మి, ఎస్కే మనీషా బేగం, ఎం.లాస్య, కె.మానస ఎంపికయ్యారు. ఈ జట్లు ఈ నెల 22,23 తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని పీడీ టి.సరస్వతి, హెచ్‌ఎం పి. రవీంద్రనాథ్ తెలిపారు. జిల్లాలోని పలువురు పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మలకపల్లిలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

తాళ్లపూడి: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మలకపల్లి గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డుకు బుధవారం కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, సర్పంచ్ రాపాక రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు పాల్గొన్నారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

కంబాలచెరువు: స్థానిక మూలగొయ్యి ప్రాంతంలోని డ్రైనేజీలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ గుణదలకు చెందిన కె.శ్రీహరిప్రసాద్ (51) గోకవరం బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఒక హోటల్‌లో పనిచేస్తున్నాడు. అతను నిత్యం మూలగొయ్యిలోని డ్రైనేజీ గోడపై కూర్చుని మద్యం తాగేవాడు. అయితే అతను మూడు రోజుల నుంచి రాకపోవడంతో హోటల్ యజమాని అతని ఇంటికి వెళ్లాడు. తలుపు వేసి ఉండడంతో అతని కోసం చూశాడు. ఈ క్రమంలో మూలగొయ్యి రామాలయం వద్ద డ్రైనేజీలో వ్యక్తి మృతదేహం తేలియాడుతుందని, అటుగా వెళ్లిన అతను శ్రీహరిప్రసాద్‌ను గుర్తుపట్టి సమాచారాన్ని పోలీసులకు తెలిపాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక కొరతతో ఇక్కట్లు

- ఉపాధి కోల్పోయిన వేలాది శ్రామికులు
- నిలిచిపోయిన గృహ నిర్మాణాలు
- లారీల యజమానులకు గడ్డుకాలం



ఉసులుమర్రులో నిండుకున్న ఇసుక నిల్వలు



పెరవలిలో ఇసుక లేక సగంలో నిలిచిపోయి గృహ నిర్మాణం

పెరవలి: మేడి పండు చూడు మేలిమై ఉండు -పొట్టవిప్పి చూడు పురుగులుండు అన్న చందంగా ఉంది కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు అవుతున్నా గృహ నిర్మాణదారులకు సక్రమంగా ఇసుక లభ్యం కావడం లేదు. వారు గగ్గోలు పెడుతున్నారు. పేరుకే ఉచిత ఇసుక విధానం. లారీ ఇసుకను బహిరంగ మార్కెట్‌లో రూ.20 వేల రేటుకు అమ్ముతున్నారు. అంత రేటు పెట్టి ఇసుక కొనుగోలు చేయలేని భవన నిర్మాణదారులు ఎక్కడి పనులను అక్కడే నిలిపివేస్తున్నారు. ఈ నెల 16 నుంచి ఓపెన్ రీచ్‌ల ద్వారా ఇసుక తవ్వకాలు చేపడతామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఎక్కడా అది ఆచరణకు నోచుకోవడం లేదు. దీనికి తోడు ఉన్న ఇసుక నిల్వలు ఇప్పటికే నిండుకున్నాయి. ఇసుక అందుబాటులో లేక గృహ నిర్మాణాలు సగంలోనే నిలిచిపోయాయి. దాంతో తాపీమేస్త్రీలు, ఇనుము కట్టే వారు, కూలీలు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

ఇసుకపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవిస్తున్నవారు నిడదవోలు నియోజకవర్గంలో సుమారు 10 వేల మంది ఉన్నారు. వారందరూ ఉపాధి లేక కుటుంబ పోషణకు ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నారు. చెంతనే గోదావరి ఉన్నా, కూటమి ప్రభుత్వ విధానపరమైన లోపాల వల్ల ఇసుక లభ్యం కావడం లేదు. బ్లాక్ మార్కెట్‌లో లారీ ఇసుకను రూ.20 వేలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు నిర్మాణదారులు పేర్కొంటున్నారు. ఇసుకకు ఇంత రేటు గతంలో ఎప్పుడూ లేదని నిర్మాణరంగ నిపుణులు పేర్కొంటున్నారు.

నిండుకున్న నిల్వలు

వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లాలో 2.70 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే ఎలాంటి అనుమతులూ లేకుండా దోచేయడంతో ఆ నిల్వలు తగ్గిపోయాయి. అక్రమ తవ్వకాల వలన జిల్లాలో సుమారు రూ.100 కోట్ల విలువైన ఇసుక అక్రమంగా తరలి పోయిందని పత్రికలు గగ్గోలు పెట్టాయి. దాంతో ఆలస్యంగా మేల్కొన్న జిల్లా అధికారులు ఇసుక అక్రమాలను అడ్డుకున్నారు. జిల్లా సర్వేయర్లు, మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు ఇసుక గుట్టలను సర్వే చేసి 1.70 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు ఉన్నట్టుగా నిర్ధారించారు. అప్పుడైనా ఆ ఇసుకను సక్రమంగా నిర్మాణదారులకు అందించారా? అంటే అదీ లేదు. జిల్లాలో మంగళవారం రాత్రికి కేవలం 35 వేల టన్నుల ఇసుక నిల్వలు మాత్రమే ఉన్నాయని మైనింగ్ అధికారులు తెలిపారు. నిడదవోలు నియోజకవర్గంలోని పెండ్యాల, పందలపర్రు ఇసుక గుట్టల వద్ద కొద్దిపాటి నిల్వలు ఉన్నాయి. అది కూడా అడుగు ఇసుక కావడంతో మట్టి కలిసిపోయి ఉందని డ్రైవర్లు తెలిపారు.

కిస్తీ కట్టలేకపోతున్న లారీ ఓనర్లు

ఇసుక తరలింపు కోసం నిడదవోలు నియోజకవర్గంలో 300 లారీలను అందుబాటులో ఉంచారు. ఇప్పుడు ఇసుక లభ్యత లేకపోవడంతో ఈ లారీలను కొనుగోలు చేసిన యజమానులు కిస్తీలు కట్టలేకపోతున్నారు. ఒక్కో లారీకి నెలకు రూ.50 వేల చొప్పున కిస్తీ చెల్లించాలి. గతంలో ఇసుక రవాణా సక్రమంగా జరిగినపుడు ఈ మొత్తాన్ని సులభంగా చెల్లించే వారు. మూడు నెలలుగా పనులు లేకపోవడంతో వాహనాలను నిలుపుదల చేసి ఉంచారు. మరోపక్క ఇసుక రవాణాపై ఆధారపడి జీవిస్తున్న డ్రైవర్లు, క్లీనర్లకు జీతాలు కూడా చెల్లించలేకపోతున్నారు.

వేలాది కుటుంబాల ఉపాధికి విఘాతం



ఇసుక సరఫరా నిలిచిపోవడంతో వేలాది కుటుంబాల ఉపాధికి విఘాతం ఏర్పడింది. ఎన్నో కుటుంబాలు పస్తులు ఉండే పరిస్థితి నెలకొంది. తాపీమేస్త్రీలు, వారి కింద పని కూలీలు, ఐరన్ కట్టే వారు, శ్లాబ్ వేసేవారు, సెంట్రింగ్ పనులు చేసే వారు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక ఉచితం అనేది కేవలం ప్రభుత్వ ప్రకటన మాత్రమే. ఎక్కడా ఉచితంగా దొరకడం లేదు.

– కుసుమే సూరిబాబు, గృహ నిర్మాణదారుడు, ఖండవల్లి

ఇతర పనులకు వలస



నా కింద ఐదుగురు కూలీలు పని చేసేవారు. ఇసుక లేక తాపీ పనులు బాగా తగ్గిపోయాయి. వారు ఇతర పనులకు వెళ్లిపోయారు. ఉపాధి లేక ఆర్థికంగా నలిగిపోతున్నాం. పనుల కోసం పట్టణాలకు వెళ్లవలసి వస్తోంది. అదే ఇసుక దొరికితే స్వగ్రామాల్లోనే తాపీ పనులు చేసుకునేవారం.

– పంతం రమేష్, తాపీమేస్త్రీ, అన్నవరప్పాడు, పెరవలి మండలం

చదువుతో పాటు విజ్ఞానమూ పెంచుకోవాలి

- బాలల హక్కుల కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్
- అనంతపల్లి జెడ్పీ హైస్కూల్ సందర్శన



విద్యార్థినులతో మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్

నల్లజర్ల: హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులు చదువుతో పాటు విజ్ఞానాన్ని కూడా పెంచుకోవాలని బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ జంగం రాజేంద్రప్రసాద్ సూచించారు. దీనివల్ల భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించ గలుగుతారని ఆయన న్నారు. మండలంలోని అనంతపల్లి జెడ్పీ హైస్కూల్‌ను బుధవారం మధ్యాహ్నం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల ప్రాంగణం, టాయిలెట్స్, తరగతి గదులు, వసతి సౌకర్యాలు పరిశీలించారు. అనంతరం 9,10 తరగతుల విద్యార్థులతో డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా విద్యారంగంలో వస్తున్న సాంకేతిక మార్పులను ఎప్పటికప్పుడు విద్యార్థులు గమనించాలన్నారు. పోటీ ప్రపంచాన్ని తట్టుకోవాలంటే పాఠశాల స్థాయి నుంచే ప్రతి పాఠ్యాంశాన్ని క్షుణ్ణంగా, స్పష్టంగా అవగాహన చేసుకోవాలన్నారు. హెచ్‌ఎం పి.జాన్ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

4న గోదావరికి మహా నీరాజనం

- అన్ని శాఖలూ సమన్వయంతో పని చేయాలి
- ఆర్డీవో రాణి సుస్మిత
- పాల్గొన్న దాస సాహిత్య ప్రాజెక్ట్ విశేషాధికారి ఆనంద తీర్థాచార్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాణి సుస్మిత. చిత్రంలో ఆనంద తీర్థాచార్యులు

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలో నవంబర్ 4న తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్వహించే గోదావరి మహా నీరాజనం కార్యక్రమాన్ని అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఆర్డీవో రాణి సుస్మిత పేర్కొన్నారు. గోదావరి మహా నీరాజనం ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో బుధవారం రాత్రి ఆర్డీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ విశేషాధికారి పగడాల ఆనందతీర్థాచార్యులు కూడా పాల్గొన్నారు. హారతి కార్యక్రమాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆదేశించారు. గోష్పాద క్షేత్రానికి వచ్చే భక్తులకు తాగునీరు, పారిశుధ్యం నిర్వహణ బాధ్యతలను పురపాలక సంఘం చూసుకోవాలన్నారు. పోలీసు, మత్స్య, విద్యుత్, అగ్నిమాపక, పోలీసు, దేవదాయ శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. దాస సాహిత్య ప్రాజెక్ట్ విశేషాధికారి ఆనంద తీర్థాచార్యులు మాట్లాడుతూ గోదావరి మహా నీరాజనానికి టీటీడీ నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను తీసుకు వస్తామన్నారు. గోష్పాద క్షేత్రంలో ఏటా నిర్వహించే ఈ వేడుకకు పది వేల మందికి పైగా భక్తులు హాజరు కావచ్చన్నారు. వారికి అవసరమైన ఏర్పాట్లు ముందస్తుగా చేసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆయన కోరారు. స్వామి భజన బృందంతో పాటు గానామృతం, అనంతరం స్వామి వారి దివ్య కల్యాణం , గోదారమ్మకు హారతి నిర్వహిస్తామన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెరచుకున్న ప్రైవేట్ మద్యం షాపులు



ఖండవల్లిలో మద్యం షాపు వద్ద క్యూలో ఉన్న మందుబాబులు

పెరవలి: ఇప్పటి వరకూ ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచిన మద్యం షాపులు బుధవారం నుంచి ప్రైవేట్ మద్యం షాపులయ్యాయి. ఈ నెల 14న తీసిన లాటరీలో షాపులు దక్కించుకున్న అదృష్టవంతులు బుధవారం నుంచి మద్యం అమ్మకాలు చేపట్టారు. ప్రస్తుతం అన్ని షాపుల్లో ప్రభుత్వం ప్రకటించిన రేట్లకే మద్యం అమ్మకాలు జరుపుతున్నారు. సమయం తక్కువగా ఉండడంతో పెరవలి మండలంలో బుధవారం సాయంత్రం మద్యం అమ్మకాలు చేపట్టారు. 'ఎక్కడపడితే అక్కడ మద్యం షాపులు ఏర్పాటు చేసుకోవద్దు. మండలంలో షాపులు పొందిన వారంతా కలసి డ్రా వేసుకుని ఎవరికి ఏ గ్రామంలో తగిలితే ఆ గ్రామంలో షాపులు ఏర్పాటు చేసుకోవాలి'. అంటూ మంగళవారం రాత్రి వరకూ మద్యం షాపులు పొందిన వారిపై ఎక్సైజ్ శాఖ అధికారులు వత్తిడి తెచ్చిన విషయం తెలిసిందే. దీంతో అయోమయంలో పడిన షాపుల యజమానులు దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశంతో ఆ విషయం పక్కకు వెళ్లిపోయింది. బుధవారం సాయంత్రం ప్రైవేట్ మద్యం షాపుల్లో అమ్మకాలు జోరుగా సాగాయి. పెరవలి మండలంలో ఐదు మద్యం షాపులు తెరుచుకోవడంతో మందుబాబులు వాటి వద్ద బారులు తీరారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి ప్రభుత్వ మద్యం షాపులు మూతపడగా, బుధవారం ఉదయం షాపులు తెరుచుకోలేదు. దాంతో చుక్క లేక మందుబాబులు విలవిల్లాడిపోయారు. ఎట్టకేలకు బుధవారం సాయంత్రం ప్రైవేట్ షాపులు తెరుచుకోవడంతో ఉత్సాహంలో క్యూలైన్‌లో నిల్చున్నారు.

నిడదవోలు మండలంలో ప్రారంభం కాలేదు

నిడదవోలు రూరల్: నూతన మద్యం విధానం బుధవారం నుంచి అమల్లోకి వచ్చినప్పటికీ మండలంలోని వివిధ గ్రామాల్లో ఇంకా షాపులను ప్రారంభించలేదు. దాంతో మందుబాబులకు ఎదురుచూపులు తప్పడం లేదు. మండల పరిధిలో ఐదు దుకాణాలకు వేలం పాటల్లో సిండికేట్‌గా పలువురు వ్యక్తులు దక్కించుకున్నారు. షాపులు ఏర్పాటు చేసేందుకు అనువుగా ఉన్న స్థలాల కోసం సిండికేట్లు తీవ్రంగా అన్వేషిస్తున్నారు. తిమ్మరాజుపాలెం, సమిశ్రగూడెంలో షాపులు ఏర్పాటు చేసేందుకు పలువురు ఆసక్తి కనబరిచి కూటమి నాయకుల సిఫార్సులతో ఎక్సైజ్ అధికారులపై ఒత్తిడి తీసుకు వస్తున్నారు.

వేపనూనె, ఇసారియాతో తెల్లదోమకు చెక్

- కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శేష కిరణ్
- గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



చీపురుగూడెంలో రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ శేషకిరణ్

నల్లజర్ల: ఆయిల్‌పామ్ తోటల్లో తెల్లదోమ తెగులు నివారణకు వేపనూనె, ఇసారియా శిలీంద్రాన్ని పిచికారీ చేస్తూ బదనికలు వదలాలని వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శేష కిరణ్ రైతులకు సూచించారు. కొమ్ము పురుగు, ఎర్ర ముక్కు పురుగుల నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. మండలంలోని చీపురుగూడెం, పోతవరం గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శేష కిరణ్ కొబ్బరి, జీడిమామిడి సాగులో సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. సేంద్రియ వ్యవసాయంపై డాక్టర్ పెదబాబు మాట్లాడారు. పామాయిల్ తోటల్లో కుళ్లు నివారణకు ఆ భాగాన్ని తొలగించి ఒక గ్రాము కార్బండైజం పొడిని లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. డీఆర్సీ ఏఓ వెంకన్నబాబు మాట్లాడుతూ వరి పంటపై సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏఓ కమల్‌రాజ్, ఉద్యాన శాఖాధికారి బబిత, ఏఈఓ పుష్ప, వ్యవసాయ సహాయకులు దుర్గాభవాని, అనూష, పలువురు రైతులు పాల్గొన్నారు.

తుంపర సేద్యంపై అవగాహన

చాగల్లు: తుంపర సేద్యం, డ్రిప్ ఇరిగేషన్‌పై రైతులు అవగాహన పెంచుకోవాలని కొవ్వూరు ఉద్యాన అధికారి సీహెచ్ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని చిక్కాల గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొవ్వూరు ఉద్యాన అధికారి సీహెచ్ శ్రీనివాసు, మండల వ్యవసాయా ధికారి వేణుగోపాలకృష్ణ, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైతులు హాజరయ్యారు. తుంపర సేద్యం , డ్రిప్ ఇరిగేషన్‌పై అధికారులకు రైతులు వివరించారు.

ఇసుక ర్యాంపులకు ప్రతి వారం బిల్లులు

ఆర్డీవో రాణి సుస్మిత వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సుస్మిత

కొవ్వూరు: బోట్స్‌మెన్ సొసైటీల ఆధ్వర్యంలో నడుస్తున్న ఇసుక ర్యాంపుల్లో బిల్లులు వారానికి ఒకసారి చెల్లించేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో రాణి సుస్మిత ప్రకటించారు. ఇసుక ర్యాంపుల నిర్వహణపై బోట్స్‌మెన్ సొసైటీ నిర్వాహకులు, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులతో బుధవారం రాత్రి ఆర్డీవో కార్యాయంలో ఆమె సమీక్ష సమావేశం నిర్వహి ంచారు. గురువారం నుంచి పూర్తిస్థాయిలో ఆఫ్ లైన్‌లోనూ వినియోగదారులకు ఇసుక అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక సరఫరాను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌ల ద్వారా మరింత సులభతరం చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు మాట్లాడుతూ బోట్స్‌మెన్ ర్యాంపుల్లో బిల్లుల పెండింగ్ కారణంగా బోట్ల నిర్వహణ భారంగా మారిందన్నారు. త్వరితగతిన బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాత బిల్లులు రావడానికి కొంత సమయం పడుతుందని ఆర్డీవో బదులిచ్చారు. నెల రోజులుగా పెడుతున్న బిల్లులన్నీ సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఇసుక ర్యాంపుల వద్ద ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కరుటూరి కాశీ విశ్వనాథ్, ముళ్లపూడి కాశీ, పాకా జయరామ్, పట్టణ సీఐ పి.విశ్వం, ఏజీఆర్‌బీ ఏఈ మణికంఠరాజు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల సర్పంచ్‌పై సస్పెన్షన్ వేటు

ద్వారకాతిరుమల: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ద్వారకాతిరుమల పంచాయతీ సర్పంచ్ కుంటం స్వర్ణలతపై సస్పెన్షన్ వేటు పడింది. అలాగే దుర్వినియోగమైన నిధులు రూ.53,57,376 లను 15 రోజుల లోగా ఆమె నుంచి రికవరీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే. ద్వారకాతిరుమల పంచాయతీలో నిధులు దుర్వినియోగమైనట్టు గ్రామానికి చెందిన నిమ్మగడ్డ అముక్త ఈ ఏడాది జనవరి 29న స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్‌ను విచారణకు ఆదేశించారు. దీనిపై విచారణ జరిపిన అధికారులు సర్పంచ్ కుంటం స్వర్ణలత రూ. 53,57,376 లు, అలాగే కార్యదర్శి ఎల్. వెంకటేశ్వరరావు రూ.1,30,85,013 , గతంలో ఇక్కడ పంచాయతీ ప్రత్యేకాధికారిగా పనిచేసిన ఎస్.ఆశీర్వాదం రూ.18,73,538 లను దుర్వినియోగం చేసినట్టు తేల్చారు. దీనికి సంబంధించి ఇటీవల కార్యదర్శి వెంకటేశ్వరరావును, లింగపాలెం ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న ఆశీర్వాదంలపై అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. కాగా సర్పంచ్ కుంటం స్వర్ణలతకు ఈ ఏడాది జూలై 29న ప్రస్తుత కలెక్టర్ వెట్రిసెల్వి షోకాజ్ నోటీసు జారీ చేయగా, దానికి ఆగస్టు 9న సర్పంచ్ సమాధానమిచ్చారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో కె.అనురాధ సర్పంచ్ స్వర్ణలతను 6 నెలల పాటు సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే దుర్వినియోగమైన సొమ్మును 15 రోజుల లోగా సర్పంచ్ నుంచి రికవరీ చేసి, పంచాయతీ ఖాతాకు జమ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ఉప సర్పంచ్ బొండాడ సావిత్రికి సర్పంచ్ బాధ్యతలు అప్పగిస్తూ, ఈఓపీఆర్డీ ఏవీ సుబ్బరాయన్‌కు కొంటర్ సైన్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

నిడదవోలు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి పలుమార్లు గ్రామాల్లో విద్యుత్ కోతలు విధించారు. అకాల వర్షం కురవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. సమిశ్రగూడెం, విజ్జేశ్వరం, డి.ముప్పవరం, గోపవరం తదితర గ్రామాల్లో రాత్రి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. లో వోల్టేజ్ సమస్య ఏర్పడడంతో పలు గృహాల్లో టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి. గ్రామాల్లో లైన్‌మేన్ల కొరత వేధించడంతో ఏ చిన్న సమస్య తలెత్తినా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులకు అవస్థలు పడుతున్నారు.

నేడు స్వామివారి తిరు కల్యాణం



శ్రీవారి ఆలయ అనివెట్టి మంటపంలో కల్యాణ వేదిక నిర్మిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవానికి క్షేత్రంలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయ అనివెట్టి మంటపంలో స్వామివారి కల్యాణ వేదిక నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గురువారం సాయంత్రం నాటికి ఈ పనులు పూర్తవుతాయని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఆలయ పరిసరాలతో పాటు, కల్యాణ వేదిక ప్రాంతాన్ని పచ్చిపూలతో శోభాయమానంగా అలంకరిస్తున్నారు. కల్యాణ వేడుక అనంతరం స్వామివారి తిరువీధి సేవకు వినియోగించే వెండి గరుడ వాహనాన్ని ఇప్పటికే ముస్తాబు చేశారు. రాత్రి 8 గంటల నుంచి ప్రారంభమయ్యే స్వామి, అమ్మవార్ల కల్యాణ వేడుకలో పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని ఈఓ తెలిపారు.

కార్తికంలో శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

కొవ్వూరు: పవిత్ర కార్తిక మాసంలో శైవ క్షేత్రాల దర్శనం నిమిత్తం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్టు కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ బుధవారం తెలిపారు. నవంబర్ 2 నుంచి 30 వరకూ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పంచారామా క్షేత్రాలైన అమరావతి, అమరారామం, భీమవరం సోమారామం, పాలకొల్లు క్షీరరామం, దాక్షారామ భీమారామం, సామర్లకోట కుమారారామాలకు భక్తులను తీసుకుని వెళ్తామన్నారు. ప్రతి ఆదివారం నవంబర్ 3,10,17,24, తేదీల్లో రాత్రి ఏడు గంటలకు కొవ్వూరు డిపో నుంచి బస్సు బయల్దేరి తర్వాత రోజు రాత్రి ఏడు గంటలకు కొవ్వూరు చేరుతుందన్నారు. ఉద్యోగస్తుల కోసం కార్తిక మాస శనివారాలైన 2,9,16,23,30 తేదీల్లో రాత్రి ఏడు గంటలకు బస్సు బయల్దేరి సోమవారం ఏడు గంటలకు తిరిగి కొవ్వూరు చేరుతుందన్నారు. ఒక్కొక్కరికి టిక్కెట్ రూ.700గా నిర్ణయించామన్నారు. సూపర్ లగ్జరీ బస్సుకు రూ.1,070 చార్జీగా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

గంబూషియా చేపల విడుదల

కొవ్వూరు: మండలంలోని దొమ్మేరు, పశివేదల, వేములూరు, పెనకనమెట్ట గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో గంబూషియా చేపలు వదిలినట్టు దొమ్మేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.ధర్మరాజు బుధవారం తెలిపారు. ఈ చేపలు దోమల లార్వాను తింటాయన్నారు. ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. దొమ్మేరు సర్పంచ్ తానేటి కుమారి, వైద్యాధికారి డాక్టర్ దివ్య, సీహెచ్‌వో బీవీ లక్ష్మి, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

22న చండీ హోమం

కొవ్వూరు: గోష్పాద క్షేత్రంలోని జ్ఞాన సరస్వతీ ఆలయంలో ఈ నెల 22న చండీ హోమం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పౌర్ణమి సందర్భంగా గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ఈ హోమం ప్రారంభం అవుతుందన్నారు.కావున భక్తులు ఈ చండీ హోమానికి హాజరు కావాలని కోరారు.

గోదావరి నదికి హారతులు

కొవ్వూరు: అశ్వయుజ పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి స్థానిక గోష్పాద క్షేత్రంలో గోదావరి నదికి మహా నీరాజనం సమర్పించారు. నీరాజన సమితి ఆధ్వర్యంలో ముందుగా గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం నదికి వివిధ రకాలైన హారతులు సమర్పించారు. మాసోత్సవ కార్యక్రమంలో గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగోట్ల కృష్ణారావు, పలువురు పండితులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీవారికి ఎదుర్కోలు ఉత్సవం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాల్లో నాల్గో రోజైన బుధవారం స్వామివారికి ఎదుర్కోలు ఉత్సవం వైభవంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్లను ఆలయం నుంచి వెండి శేష వాహనంపై నిత్య కల్యాణ మంటపం వద్దకు తీసుకొచ్చారు. అక్కడి వేదికపై కల్యాణ మూర్తులను ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఎదుర్కోలు ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, అర్చకులు, పండితులు, భక్తులు రెండు జట్లుగా విడిపోయి ఒక జట్టు స్వామివారి గుణగణాలను, విశిష్టతను కొనియాడారు. అలాగే రెండవజట్టు అమ్మవార్ల గుణగణాలను, కీర్తిని తెలియజేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com